# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

శనివారం | 16 మే , 2026 | పేజీలు : 08




### కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు

# తలెత్తకుండా చర్యలు

#### ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయండి

#### : జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశం

**ప్రజాపక్షం/నల్లగొండ :** ధాన్యం కొనుగోళ్లను మరింత ముమ్మరం చేసేందుకు మండల ప్రత్యేక అధికారులు కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో ప్రభుత్వ ప్రాధాన్య పథ కాలపై సమీక్ష నిర్వహించారు. ధాన్యం పెండింగ్ ఎక్కువగా ఉన్న కేంద్రాలను సందర్శించి కారణాలు విశ్లేషించాలని, లారీలు, హమాలీల కొరత ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. కొనుగోళ్లలో ఎలాంటి తరువాయి 2లో...



#### ఎఫ్‌సిఐ నల్లగొండ స్టోర్ గదిలో అగ్నిప్రమాదం

**ప్రజా-పక్షం/-నల్లగొండ టౌన్ :** బీఎస్సీ, ఎఫ్‌సీఐ నల్లగొండలోని రికార్డు స్టోర్ గదిలో శుక్రవారం రాత్రి 8.30 గంటలకు అగ్ని ప్రమాదం సంభవించింది. పాత రికార్డులు, వాడని ఎలక్ట్రికల్ పరికరాలు, యూపీఎస్‌లు నిల్వ ఉన్న గదిలో మంటలు చెల రేగాయి. భద్రతా సిబ్బంది, స్థానికులు వెంటనే గుర్తించి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది తక్షణం స్పందించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనపై కొందరు సోషల్ మీడియాలో ధృవీకరించని ఆరోపణలు చేస్తూ తప్పుడు సమాచారం ప్రచారం చేస్తున్నారని ఎఫ్‌సీఐ డిపో మేనేజర్ జి.సుకుమార్ తెలిపారు. ప్రమాదంలో ప్రస్తుతం వినియోగంలో ఉన్న ముఖ్యమైన పత్రాలు, రికార్డులు ఏవీ దెబ్బతినలేదని, ధాన్యానికి ఎలాంటి నష్టం జరగలేదని స్పష్టం చేశారు. అన్ని కీలక రికార్డులు డిజిటల్ రూపంలో సురక్షితంగా ఉన్నాయన్నారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు జరుగుతోందని, పోలీసు ఫిర్యాదు కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. తప్పుడు ప్రచారాన్ని నియంత్రించి సహకరించాలని జిల్లా ప్రజా సంబంధాల అధికారికి విజ్ఞప్తి చేశారు.

## తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు



### ప్రభుత్వ విద్యా రంగానికి

# అధిక ప్రాధాన్యత

#### డిండి కెజిబివి రూ.50లక్షలతో అదనపు తరగతి గదుల ప్రారంభం

#### రూ.38లక్షలతో ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బాలునాయక్

**ప్రజాపక్షం/డిండి :** విద్య ద్వారానే రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని, ప్రభుత్వ విద్యారంగానికి ప్రజా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం డిండి మండల కేంద్రంలోని కేజీబివి పాఠశాలలో రూ.50లక్షలతో అదనపు తరగతి గదులను ఎంఎల్‌ఏ బాలునాయక్ ప్రారంభించి, రూ.38 లక్షలతో ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, పేదలకు వీటిని అందించేందుకు పెద్ద ఎత్తున ముందుకు తీసుకెళుతున్నదని ఇందులో భాగంగానే నియోజకవర్గానికి ఒకటి చొప్పున 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ పాఠశాలలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు 23వేల కోట్ల బడ్జెట్ కేటాయించడం జరిగిందని, 29వేల ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, 18లక్షల 50వేల మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. పేద విద్యార్థులకు విద్యతో పాటు, అన్ని ఉచితంగా అందించాల్సిన అవసరం ఉందని, ఎక్కడ విద్య ఉంటే అక్కడ అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఇది వరకే నియోజకవర్గంలో ఐదు కేజిబివిలు, ఐదు మోడల్ స్కూల్స్ తీసుకురావడం జరిగిందని, కేజీబివిలన్నింటికి కాంపౌండ్ తరువాయి 2లో

### రెడ్‌క్రాస్ సొసైటీ

# ప్రత్యేక సభ్యత్వ నమోదు



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సూర్యాపేట జిల్లాలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రత్యేక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక సభ్యత్వ నమోదు డ్రైవ్ మే 15 నుండి జూన్ 15 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రజలు, అన్ని శాఖల అధికారులు అధిక సంఖ్యలో ఇందులో భాగస్వాములు కావాలని సూచించారు. విపత్తుల సమయంలో తక్షణ సహాయక చర్యలు అందించడం, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం, పేదలకు వైద్య సహాయం అందించడం, తల్లిశిశు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం, ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహించడం వంటి ఎన్నో సామాజిక బాధ్యతాయుతమైన తరువాయి 2లో..

## రైతులకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు



2

రామన్నపేట సిఐ ఎన్.వెంకటేశ్వర్లు

## ప్రభుత్వ విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత

(మొదటి పేజీ తరువాయి)

వాల్ తీసుకువచ్చామని అన్నారు. పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థుల చదువుల కోసం ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. ఈకార్యక్రమంలో మండల విద్యాధికారి నర్సింహ, ఎంపిడివో వెంకన్న, కెజిబివి స్పెషల్ ఆఫీసర్ లక్ష్మీ, మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా క్యావర్గ సభ్యులు బుచ్చిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనోద్దీన్, కాంగ్రెస్, సిపిఐ నాయకులు జంగా రెడ్డి,లక్ష్మీ, శైలేష్, లక్ష్మతి, సర్పంచ్‌లు రవి, రాజేందర్ రెడ్డి, రేఖ్య, తీజు, నాయకులు సలయ్య, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్, సాయికుమార్, అనంతగిరి, సోమాని తదితరులు పాల్గొన్నారు.

## యువకుడి మృతదేహం లభ్యం

ప్రజాపక్షం/కోదాడ రూరల్ : అనుమానాస్పదంగా యువకుడి మృతదేహం లభ్యమైన సంఘటన మండలంలోని గణపవరం శివారులో చోటుచేసుకుంది. మృతుడిని గణపవరంకు చెందిన బల్లూరి గణేష్‌గా పోలీసులు గుర్తించారు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గణేష్ బెంగుళూరులో హోటల్ మేనేజ్‌మెంట్ విద్యను అభ్యసిస్తున్నాడు. ఇటీవల స్వగ్రామానికి వచ్చి గురువారం రాత్రి 11 గంటల నుండి అనుమానాస్పదంగా అదృశ్యమయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతూ గాలింపు చర్యలు చేపట్టగా శుక్రవారం గణపవరం గ్రామ శివారులోని మర్రిచెట్టు కింద గణేష్ మృతదేహం కనిపించింది. గొంతు కోసి హత్య చేసినట్లుగా కనిపించడంతో సమాచారం అందుకున్న పోలీసులు క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

## జిల్లా మహాసభల కరపత్రం ఆవిష్కరణ

ప్రజాపక్షం/రామన్నపేట : యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల పరిధిలోని కక్కిరేణి గ్రామంలో ఉపాధి హామీ కూలీలలు పనిచేస్తున్న ప్రదేశానికి వెళ్లి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా బహిరంగ సభల కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కందుల హనుమంతు, మేడి ముకుంద మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం సుదీర్ఘకాలంగా ఎన్నో పోరాటాలు నడపడం వల్ల వామపక్షాల మద్దతుతో వందరోజుల పని గ్యారెంటీ చేస్తూ చట్టం చేయబడిందని, దీనికి ప్రధానమైన కారణం వ్యవసాయ కార్మిక సంఘమేనని, కుటుంబ ఆర్థిక వ్యవస్థను పెంచడానికి పేదరిక నిర్మూలన కోసం కృషి చేయడానికి ఆర్థిక భరోసాను కల్పించిన ఈ చట్టాన్ని నేడు తూట్లు పొడుస్తూ వచ్చిన నిధులను పక్కదారి మళ్లిస్తూ అనేక కొర్రీలు పెడుతూ రాను రాను ఈ చట్టాన్ని లేకుండా చేసే ప్రయత్నం కొనసాగుతుందన్నారు. మే 18న రామన్నపేట మండల కేంద్రంలో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మూడో మహాసభల సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభకి ముఖ్య అతిథిగా ఆల్ ఇండియా కార్యదర్శి బి.వెంకట్, రాష్ట్ర కార్యదర్శి ఆర్.వెంకట్ రాములు హాజరవుతున్నారని దీనికి వ్యవసాయ కార్మికులందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం గ్రామకమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు వేముల సైదులు, కన్నెబోయిన యాదయ్య, నీల సంతోష్, మమత, నాగమణి, పార్వతమ్మ, అందాలు, రాధా, కల్పన, లక్ష్మి, కవిత, మంజుల పాల్గొన్నారు.

## కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్లను 100 గ్రౌండింగ్ చేయాలని, గ్రౌండింగ్ కాని వాటిని రద్దు చేసి కొత్త లబ్ధిదారుల ఎంపిక వేగవంతం చేయాలన్నారు. జూన్ 2న లక్ష గృహప్రవేశాల్లో భాగంగా జిల్లాకు కేటాయించిన 6 వేల ఇళ్ల నిర్మాణం సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు, ఎన్ఆర్ఈజీఎస్ పనులు, జీపీ, వీవో భవనాలు, సీసీ రోడ్ల వేగవంతం చేయాలని చెప్పారు. జీవో 32 ప్రకారం ఉద్యోగుల బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలని, జిల్లా అధికారులు నెలకు 15 రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు.సమావేశంలో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జడ్‌పిసీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి, డీఆర్డీవో శేఖర్ రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**18న మాక్ డ్రిల్‌కు సిద్ధంగా ఉండాలి:**
వరదలు, అడవి మంటలు,పారిశ్రామిక ప్రమాదాల సమయంలో అత్యవసర ప్రతిస్పందన, సంసిద్ధతను పరీక్షించేందుకు ఈ నెల 18న నిర్వహించే రాష్ట్ర వ్యాప్త మాక్ డ్రిల్‌కు జిల్లా అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ బి.చంద్రశేఖర్ ఆదేశించారు.శుక్రవారం రాష్ట్ర విపత్తుల నిర్వహణ సెక్రటరీ డి.హరిచందన కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమీక్షించి, నల్గొండ జిల్లా మాక్ డ్రిల్‌కు ఎంపికైనందున అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. విపత్తుల సమయంలో సమర్థవంతమైన సమన్వయం, సకాలంలో స్పందన ఉండేలా అన్ని శాఖలు పనిచేయాలన్నారు. ఫైర్ సర్వీసెస్ డీజీ విక్రమ్ సింగ్ మాన్, ఎన్‌డీఎంఏ లీడ్ కన్సల్టెంట్ మేజర్ జనరల్ సుధీర్ బెహ్ల్,అదనపు ఎస్‌పి రమేష్,జిల్లా అగ్నిమాపకఅధికారిసందేశ్ పాల్గొన్నారు.

## నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ సాయం అందించాలి

### సతీష్ కుమార్ డిమాండ్

ప్రజాపక్షం/చండూరు: నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ కింద దరఖాస్తు చేసుకున్న ప్రతి లబ్దిదారునికి తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని సిపిఐ మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం చండూరు ఆర్‌డిఓ శ్రీదేవికి సిపిఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ గత ఏడు నెలలుగా అర్హులైన లబ్దిదారులు దరఖాస్తులు చేసుకున్నప్పటికీ ఇప్పటివరకు ఆర్థిక సహాయం అందక ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. దరఖాస్తులను వెంటనే పరిశీలించి అర్హులందరికీ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పేద కుటుంబాల్లో ఆకస్మిక మరణం సంభవించినప్పుడు ఆకుటుంబానికి ఆసరాగా నిలిచేందుకే ఈ



పథకం ఉద్దేశించబడిందని గుర్తు చేశారు. కానీ అధికారుల నిర్లక్ష్యం వల్ల లబ్దిదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. వినతిపత్రం అందజేత కార్యక్రమంలో సిపిఐ నాయకులు బరిగెల వెంకటేష్, బండమీద వెంకన్న, దోటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## జంతు హింసకు పాల్పడితే కఠిన చర్యలు




అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : జంతువులను హింసించరాదని,అలా చేసిన వారిపై జంతు సంరక్షణ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన జంతు హింస నివారణ సంఘం జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. జంతువుల రవాణాలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, పశు వైద్యాధికారి సర్టిఫికెట్ లేకుండా తరలించడం నేరమని స్పష్టం చేశారు.ఒకే వాహనంలో అధిక సంఖ్యలో జంతువులను తరలించకూడదని, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఉండాలని సూచించారు. జంతువుల అక్రమ రవాణాను అడ్డుకోవాలని ట్రాన్స్‌పోర్ట్, పోలీస్ అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీల్లో జంతువులకు షెల్టర్లు ఏర్పాటు చేసి, రోడ్లపై తిరిగే పశువులను గోశాలలకు తరలించాలన్నారు. కుక్కల నియంత్రణకు త్వరలో దత్తత కార్యక్రమం చేపడతామని, ఏబీసీ సెంటర్లు లేని ప్రాంతాల్లో వెంటనే ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్లకు ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్‌పి రమేష్, జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ రమేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదు

### ఎంఎల్‌ఏ బాలునాయక్



ప్రజాపక్షం/దేవరకొండ : రైతులు ధాన్యం కొనుగోలు విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎంఎల్‌ఏ నివాసం మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు సేకరణపై అధికారులు, రైస్ మిల్లర్లు, ట్రాన్స్‌పోర్ట్ ప్రొవైడర్లతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ధాన్యం సేకరణ, మద్దతు ధర, తూకంలో పారదర్శకత, గోనె సంచుల లభ్యత, సేకరించిన ధాన్యం మిల్లులకు తరలింపుపై స్వయంగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని తక్షణమే మిల్లులకు తరలించేలా లారీల సంఖ్యను పెంచి, ఎక్కడా సమస్యలు తలెత్తకుండా వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దేవరకొండలో అక్కడక్కడ లారీల కొరత, హమాలీల సమస్య ఉన్నదని దృష్టికి వచ్చిన నేపథ్యంలో ఇతర అవసరాల కోసం ఉపయోగించే లారీలు, డిసిఎంలను కొద్ది రోజులు ధాన్యం తరలింపుకు వాడాలని అన్నారు. ధాన్యం తాలు, చెత్త ఉందని మిల్లర్లు కటింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈకార్యక్రమంలో ఆర్డీవో రమణారెడ్డి, డిఎస్పి శ్రీనివాస్‌రావు, తహశీల్దార్లు, పోలీస్ అధికారులు, రైస్ మిల్లర్లు, అగ్రికల్చర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు

ప్రజాపక్షం/రామన్నపేట : మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామంలోని విద్యా రైస్ మిల్లుని రామన్నపేట సీఐ ఎన్.వెంకటేశ్వర్లు, ఎస్సై డి.నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు ప్రక్రియ, ధాన్యం తూకాలు, రైతులకు అందుతున్న సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని, ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఆలస్యం జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కాలి. తేమ, తాలు పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దు అని స్పష్టం చేశారు.

## రెడ్‌క్రాస్ సొసైటీ ప్రత్యేక సభ్యత్వ నమోదు

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమాలలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉంటుందన్నారు. ఇటువంటి ఉత్తమమైన సేవా కార్యక్రమాలను ప్రోత్సహిస్తూ విజయవంతం చేయుటకు ప్రతి ఒక్కరు బాధ్యత వహిస్తూ స్వచ్ఛందంగా సభ్యత్వం నమోదు చేసుకోవాలని కోరారు. ఈ ప్రక్రియ కోసం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నోడల్ రిజిస్ట్రేషన్ కేంద్రంగా పనిచేస్తుందని, ఆసక్తి గలవారు నేరుగా కలెక్టరేట్‌లో లేదా వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. దీనికి 18 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి భారతీయ పౌరుడు సభ్యుడిగా చేరుటకు అర్హులని వివరించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచేందుకు జిల్లా ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు పెద్దఎత్తున ముందుకు రావాలని కోరారు.

## విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి గ్రంథాలయాలు ఉపయోగం



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: సమాజ ప్రగతికి, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి గ్రంథాలయాలు నాలెడ్జ్ హబ్‌లుగా ఉపయోగపడతాయని నాగార్జున ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ అన్నారు. ప్రభుత్వ ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం కళాశాల గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో గ్రంథాలయ జ్ఞానోత్సవాలు నిర్వహించారు. విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచడం, గ్రంథాలయాల ప్రాముఖ్యత తెలపడమే లక్ష్యమని ఆయన తెలిపారు. ఈగ్రంథాలయాలు, ఆన్‌లైన్ జర్నల్స్, ఇంటర్నెట్ వనరుల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం డాక్టర్ వెల్దండి శ్రీధర్, ఎన్. కోటయ్య, డి.మధుకర్ తదితరులు పుస్తకాలు బహుకరించారు. కార్యక్రమంలో డాక్టర్ పి.రవికుమార్, డాక్టర్ అంతటి శ్రీనివాసులు, డి.మునిస్వామి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా నందికి అభిషేకం

ప్రజాపక్షం/నూతనకల్ (మద్దిరాల) : మాస శివరాత్రి, త్రయోదశి సందర్భంగా శుక్రవారం ఘనంగా నందీశ్వర స్వామికి అభిషేకం నిర్వహించారు. మద్దిరాల మండలంలోని చందుపట్ల శ్రీఅన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో స్వామి వారికి పంచామృత అభిషేకం, అన్నాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రధాన అర్చకులు ముడుంబై రఘువర్ ఆచార్యులు మాట్లాడుతూ సమస్త పితృదోషాలు జాతక గ్రహ దోషాల నివారణ కోసం మహిమాన్విత కార్యం శ్రీనందీశ్వర స్వామి వారికి త్రయోదశి రోజున అభిషేకం అనంతరం నందికి విశేష అలంకరణ చేయటం జరుగుతుందన్నారు. మాస శివరాత్రి త్రయోదశి రెండు ఒకే రోజు రావడంతో ఘనంగా శివుడికి అన్నభిషేకం అనంతరం 1008 రుద్రాక్షలతో విశేషంగా అలంకరించామన్నారు. ఒకే క్షేత్రంలో శివ కేశవులు కొలువుదీరి భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా స్వామి వార్లు ఇక్కడ అనుగ్రహిస్తారని తెలిపారు. ప్రతి సోమవారం శివుడికి అభిషేకం, శనివారం రామచంద్ర స్వామికి, శ్రీకార్యసిద్ధి ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు సింధూర అభిషేకాలు, ఆకుపూజలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు, భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మృతుడికి నివాళులర్పించిన బోగారం గ్రామ సర్పంచ్

**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేట మండలంలోని జనంపల్లి గ్రామానికి చెందిన పనసం అంజయ్య గౌడ్ శుక్రవారం రోజున అనారోగ్యంతో మృతి చెందగా వారి పార్థివదేహానికి బోగారం గ్రామసర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్ పూలమాలవేసి నివాళులు అర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించి మనోధైర్యం అందించి, కుటుంబానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట బిఆర్ఎస్ పార్టీ మాజీమండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేష్ యాదవ్, జనంపల్లి గ్రామ ఉపసర్పంచ్ చొప్పరి నరసింహ, బోగారం గ్రామ ఉపసర్పంచ్ బైకానీ ఉమామహేష్ యాదవ్, బంజారాహిల్స్ సీఐ నందగిరి వెంకటేశ్వర్లు, రామన్నపేట కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కూనూరు మల్లేష్ గౌడ్, తొల్పూరి మల్లేష్ యాదవ్, మేడి కృష్ణ, మాజీ వార్డుమెంబర్ కూనూరు రాజు, పంజాల నరేష్ గౌడ్, కూనూరు మహేష్ గౌడ్, కూనూరు నరేష్ గౌడ్, కూనూరు బక్కులు, పనసం సత్తయ్య గౌడ్, పనసం నరసింహగౌడ్, పనసం సైదులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** ప్రతి ఒక్కరు ఎండను దృష్టిలో పెట్టుకుని తెల్లవారుజామున ఆరు గంటల నుంచి పది గంటల వరకు ఉపాధి హామీ పనులు చేపట్టాలని ఎంపిడివో సరోజ కూలీలకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని గారకుంటతండా గ్రామంలో ఉపాధిహామీ పనులను గ్రామ సర్పంచ్ బాణోతు అరుణ రమేష్ నాయక్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీసర్పంచ్ సైదానాయక్, ఉప సర్పంచ్ గౌతమి సుధాకర్, పంచాయతీ కార్యదర్శి పాల్వాయి రమ్య, టెక్నికల్ అసిస్టెంట్ శిరీష, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటరెడ్డి, వార్డు సభ్యులు జయరాం, ఝాన్సీ, బూలీ, కూలీలు పాల్గొన్నారు.

## గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోండి



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** :మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రాణాలికలో భాగంగా గ్రంథాలయ దినోత్సవం సందర్భంగా పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి, ఉప సర్పంచ్ పల్లె మల్లారెడ్డి విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయాభివృద్ధికి ప్రభుత్వ సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. రానున్న రోజుల్లో డిజిటల్ లైబ్రరీగా తీర్చిదిద్దడానికి తమ వంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సురపల్లి వెంకటేష్ నేత, పందుల యాదగిరి గౌడ్, కట్ల వనజ భాస్కరాచారి, నీల అనిత శంకర్ ముదిరాజ్, సింగపంగ ప్రశాంతి రమేష్, మహమ్మద్ అలీమా యూసఫ్ ఖాన్, గ్రంథాలయ పాలకురాలు గంగాపురం ఉదయశ్రీ, క్రైమ్ మిర్రర్ రిపోర్టర్ ఉప్పల వెంకటేష్, రిపోర్టర్ గంగాపురం సాయి గౌడ్, సింగం కృష్ణ, బద్దుల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## రైతులను మరోసారి మోసం చేసిన మోదీ ప్రభుత్వం




**ప్రజాపక్షం/రామన్నపేట** :ఎంఎస్పి పేరుతో భారత రైతాంగాన్ని మోడీ ప్రభుత్వం మరోసారి మోసం చేసిందని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి అన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో జరిగిన రైతు సంఘం మండలకమిటీ సమావేశంలో మాట్లాడుతూ 2026 ఖరీఫ్ సీజన్ సంబంధించి కనీస మద్దతు ధరల్లో నామమాత్రపు పెంపును ప్రకటించడం ద్వారా బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మరోసారి రైతంగాన్ని మోసం చేసిందని విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు, డీజిల్, పెట్రోల్, విద్యుత్, నీరు, లేబర్, ఆధునిక యంత్రాలు వంటి పెట్టుబడి ఖర్చులు భారీగా పెరిగిన నేపథ్యంలో ముఖ్యంగా పశ్చిమాసియా యుద్ధ సంక్షోభం దృష్ట్యా ప్రకటించిన ఈ పెంపు ఏమాత్రం సమంజసం కాదన్నారు. రైతులపై ఉన్న కపట ప్రేమ మరోసారి బట్టబయలు అయిందని సమగ్ర సాగు వ్యవసాయం C2ఔ 50% కంటే కనీసం 50 శాతం అధికంగా ఎంఎస్పి అందించేలా స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేస్తామని పదే పదే హామీలు ఇచ్చినప్పటికీ ఇప్పుడు ప్రకటించిన కొత్త ఎంఎస్పి చాలా తక్కువగా ఉంది. వరి ధాన్యం ప్రస్తుతం కరీఫ్ కు పెంచింది.ఎ గ్రేడ్ 2461/,బి గ్రేడ్ 2441/ రూ.ఉన్నది కానీ 3250/ కనీస మద్దతు ధర ఇవ్వాలి.ప్రస్తుతం ఉన్నదానికి 800 రూపాయలు పెంచి ఇవ్వాలి అన్నారు.పెట్టిన పెట్టుబడిలో 50% కనీస మద్దతు ధర ఇవ్వాలని స్వామినాథన్ కమిషన్ సిఫారసు చేసిన వాటిని మోడీ ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు.కార్పొరేట్ల వ్యవసాయ వ్యాపార సంస్థలకు అనుగుణంగా ఉన్న రైతు వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో దేశం వ్యాప్త మరో మహా రైతు పోరాటం తప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జల్లెల పెంటయ్య ,మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, రైతు సంఘం మండల కార్యదర్శి గన్నేబోయిన విజయభాస్కర్, నాయకులు కందుల హనుమంతు, గాదె నరేందర్, వేముల సైదులు, మేడి ముకుంద తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ కోసం గంటల తరబడి ఎదురుచూపులు



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** :గ్యాస్ సిలిండర్ల సరఫరా కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వంటగ్యాస్ లేక ఇంటింటా ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం నుంచి గ్యాస్ ఏజెన్సీ లేదట మహిళలు వృద్ధులు కూలీలు బారులు తీరగా గంటలు తరబడి ఎదురుచూసిన సిలిండర్లు అందక నిరాశతో వెనుతిరుగుతున్నారు. కొన్ని రోజులుగా గ్యాసు సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడడంతో గ్రామాలు మండల కేంద్రాల్లో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుకింగ్ చేసిన సమయానికి సిలిండర్ రావడం లేదు ఫోన్ చేస్తే సరి అయిన సమాధానం చెప్పడం లేదు అంటూ వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు చాలా కుటుంబాలు కట్టెల పొయ్యిలపై వంట చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని మహిళలు వాపోతున్నారు. ప్రత్యేకంగా రోజువారి కూలీలు, చిన్న హోటలు,టిఫిన్ సెంటర్లు, టీ దుకాణాలు, కూడా గ్యాస్ కొరతతో దెబ్బతిన్నాయి.గ్యాస్ లేక వ్యాపారులు దుకాణాలు మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూలి పనులకు వెళ్లి మహిళలు ఉదయం వంటలు చేయలేక కుటుంబాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఫోన్ చేస్తే ఎవరు లిఫ్ట్ చేయరు.. ఏజెంట్స్ కి వెళ్తే రేపు రండి అంటారు కానీ గ్యాస్ మాత్రం రావడం లేదు అంటూ వినియోగదారులు మండిపడ్డారు కొందరు మహిళలు ఖాళీ సిలిండర్లతోనే ఏజెన్సీ ఎదుట నిరసనకు దిగారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గ్యాస్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

## పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి ప్రజలను మోసం చేసిన బిజేపి



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరలను పెంచి బిజేపి ప్రభుత్వం పేద మధ్య తరగతి ప్రజలను మరోసారి మోసం చేసిందని సిపిఐ రాష్ట్ర కమిటి సభ్యుడు దూళిపాళ ధనుంజయనాయుడు అన్నారు. శుక్రవారం నేరేడుచర్ల పట్టణంలో ఆయన మాట్లాడుతూ నిరుపేదల పొట్టకొట్టి కార్పొరేట్ సంస్థలకు ప్రజా ధనాన్ని పంచుతున్న మోడి నిజ స్వరూపాన్ని దేశ ప్రజలందరూ నిశితంగా గమనించాలన్నారు. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఉప ఎన్నికల ప్రచారంలో పెట్రోలియం ఉత్పత్తులు, ధరలు పెంచబోమని పదే పదే ప్రకటించిన మోడి ద్వయం ఎన్నికలయ్యాక వారి విశ్వరూపాన్ని ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. ఇటీవలే కమర్షియల్ సిలిండర్ ధర వక్కింటికి వేయి రూపాయల అమాంతం పెంచారని అన్నారు. ఆయన వెంట కత్తి శ్రీనివాసరెడ్డి, మూళ్ల జానయ్య, చిలకరాజు శ్రీను, కొమ్రరాజు వెంకట్, బండి శ్రీనివాస్, పొనుగోటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

## బిసి విద్యార్థులకు 10వేల ర్యాంకు నిబంధన ఎత్తివేయాలి

### బీసీ యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఉన్నత విద్య చదివే బీసీ విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు రియంబర్స్‌మెంట్ పథకం నిబంధన సడలింపుపై ప్రభుత్వం ఆలోచన చేసి రూ.10వేల ర్యాంకు లోపు నిబంధనను ఎత్తివేయాలని బీసీ యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ విద్యార్థులను చిన్న చూపు చూస్తూ ఎవరికి లేని విధంగా నిబంధనలను పెట్టి బీసీ విద్యార్థులకు మాత్రమే 10వేల లోపు ర్యాంకు నిబంధన పెట్టి విద్యార్థులను ఉన్నత చదువులు చదవకుండా చేయడం బీసీల పట్ల ప్రభుత్వం కక్షసాదింపు చర్యలు చేస్తుందన్నారు. 10వేల లోపు ర్యాంకు వచ్చిన విద్యార్థులకు మాత్రమే ప్రభుత్వం ఫీజు చెల్లిస్తుందని, ఆపై ర్యాంకు వచ్చిన వారికి కేవలం ప్రభుత్వం రూ.35వేలు మాత్రమే చెల్లించడం పట్ల విద్యార్థులు ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీ వంటి ఇతర కోర్సులు తీసుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం బీసీ విద్యార్థులను చదువులకు దూరం చేసే కుట్రలో భాగంగా బీసీ విద్యార్థులను అడుగడుగునా అణచివేస్తుందన్నారు. ప్రభుత్వం తక్షణమే పునారలోచన చేసి బీసీ విద్యార్థులు చదువుకుంటున్న ప్రతి కోర్సుకు పూర్తి ఫీజు ప్రభుత్వమే చెల్లించాలని అన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, అంజి, అనంతయ్య, సతీష్, నాగేశ్వర్‌రావు, బాలయ్య, కృష్ణమాచారి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ పనులను పరిశీలించిన సర్పంచ్

**ప్రజాపక్షం/నడిగూడెం:** ఉపాధి కూలీలు ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం ఆరు గంటలకు పనులకు వెళ్లి పది గంటల కల్లా పనులు ముగించుకుని ఇంటికి రావాలని సర్పంచ్ కేసగాని సరిత లక్ష్మణ్, ఎంపివో శ్రీనివాసరావు లు అన్నారు. శుక్రవారం మండలంలోని వల్లాపురం గ్రామంలో సర్పంచ్ సరిత లక్ష్మణ్, ఎంపివో శ్రీనివాసరావు పాలకవర్గ సభ్యులతో కలిసి ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. తగినంత నీళ్లు తాగడం, మధ్య మధ్యలో విశ్రాంతి తీసుకోవాలని అన్నారు. ఉపాధి కూలీలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లారెడ్డి, ఉప సర్పంచ్ కోట చంద్రశేఖర్‌రెడ్డి, వార్డు సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు, మేట్లు పాల్గొన్నారు.

## పాఠశాల ఆవరణలో వేసవి శిబిరం

**ప్రజాపక్షం/రామన్నపేట** :యాదాద్రి భువనగిరిజిల్లా రామన్నపేట మండల పరిధిలోని ఇంద్రపాలనగరం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో శుక్రవారం రోజున వేసవికాల శిబిర ఉచిత కరాటే శిక్షణా తరగతులు గ్రామసర్పంచ్ గర్దాసు విక్రమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని యువతియువకులు,బాలబాలికలు ఈసదవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలోఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి, ఈర్లపల్లి మల్లయ్య, మర్రి మహేష్, గర్దాస్ శ్రీకాంత్, గర్దాస్ సాయి, ఈర్లపల్లి కృష్ణ, ఈర్లపల్లి రమేష్, విద్యార్థులు, కరాటే మాస్టర్ అప్పం చెన్నకేశ్వర్, తెల్లం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో విద్యా వారోత్సవాలు




**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన విద్యా వారోత్సవాలలో భాగంగా శుక్రవారం హుజూర్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ దినోత్సవం కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సోంపంగు రామారావు మాట్లాడుతూ లైబ్రరీకి వెళ్లని వారికి లైఫ్ లేదు అనే మాటతో ప్రారంభిస్తూ ప్రతి వ్యక్తికి పుస్తక పఠనం అవసరమని, విద్యార్థులందరూ క్లాసులు వినడంతో పాటు గ్రంథాలయానికి హాజరయ్యే విధంగా విద్యార్థులను ప్రోత్సహించాలని కోరారు. గ్రంథాలయానికి పుస్తకాలు బహుకరించినట్లు ఐక్యూ ఐసి కోఆర్డినేటర్ ఎస్ ప్రియాంకను వైస్ ప్రిన్సిపాల్ సునంద, పిజిక్స్ డాక్టర్ వెంకటేశ్వరరావు ను అభినందించారు. ప్రిన్సిపాల్ ఎస్.రామారావు ఆసియా ఎకానమిక్ బుక్‌ను బహుకరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సునంద, బి.శ్రీనివాస్, డాక్టర్ నగేష్, ఎస్.బాలరాజు, నాగార్జున, లక్ష్మి నారాయణ, మాలతి, స్రవంతి, రాధమ్మ, జాక్టో ఓపెన్ డిగ్రీ సైదా పాల్గొన్నారు.

## విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి



**ప్రజాపక్షం/కోదాడ:** విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని కోదాడ మండల విద్యాధికారి సలీంషరీఫ్ అన్నారు. శుక్రవారం కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రంథాలయ పఠనం ద్వారా విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవచ్చునని, విద్యార్థులకు పుస్తక పఠనం అలవాటు పెరుగుతుందని, జ్ఞాన విస్తరణకు గ్రంథాలయాలు దోహదపడతాయని అన్నారు. వివిధ రకాల పుస్తకాలతో పాటు డిజిటల్ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు మార్కేండేయ, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, పాండురంగాచారి, ఖాజామియా, చిన్నప్ప, జానకిరామ్, పద్మావతి, విజయ, పద్మ పాల్గొన్నారు

## గ్రంథాలయంలో విద్యా వారోత్సవాలు

**ప్రజాపక్షం/రామన్నపేట :**శాఖ గ్రంథాలయం రామన్నపేట ఆవరణంలో గురువారం రోజున రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాలను పురస్కరించుకొని రామన్నపేట శాఖ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి, గ్రంథాలయ పాఠకులు, గ్రంథాలయ సభ్యులు, గ్రంథాల సిబ్బంది మరియు ఇన్చార్జ్ కట్కూరి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## కరాటే పోటీలలో విజేతలకు సర్టిఫికెట్లు అందజేత



**ప్రజాపక్షం/మోత్కూర్ :** కరాటే బెల్టుల ప్రధానోత్సవం స్టాండర్డ్ షిటూరియో ఇంటర్నేషనల్ కరాటే డు ఆధ్వర్యంలో శుక్రవారం మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని జెడ్పిహెచ్ఎస్ స్కూల్ ఆవరణలో కరాటే బెల్టుల ప్రధానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొ.వెంకటేశ్వర్లు, గ్రాండ్ మాస్టర్ పీ .బాలరాజు మాట్లాడుతూ కరాటే నేర్చుకోవడం వలన మంచి ఫిట్నెస్ ఉంటుందని మంచి ఆరోగ్యంగా ఉంటారని క్రమశిక్షణ కలుగుతుందని ముఖ్యంగా అమ్మాయిలు కరాటే జూడోలు మెలకువలు నేర్చుకోవాలని, తల్లిదండ్రులు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిహెచ్ఎస్ హెచ్ఎం అరవింద రాయుడు, మాజీ సర్పంచ్ బయ్యని పిచ్చయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి అవిశెట్టి అవిలిమల్లు, ఇన్స్పెక్టర్స్ కనుక రాజు, బుర్ర సంతు, చొల్లేటి నరేష్, పోచం మచ్చేందర్, పుల్కరం నిఖిల్, ఊరమచ్చగిరి తదితరులు పాల్గొన్నారు.

## విద్యా వారోత్సవాల్లో పుస్తక ప్రదర్శన

**ప్రజాపక్షం/రామన్నపేట :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామన్నపేటలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాలను ఐదవ రోజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో పుస్తకప్రదర్శన, పుస్తకాల వితరణ, పుస్తక సమీక్ష మరియు ఉత్తమ పాఠకులకు బహుమతి ప్రదానం వంటి కార్యక్రమాల్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటు గ్రంథాలయంలోని పుస్తకాలను కూడా అధ్యయనం చేసినప్పుడే విస్తృతమైన విషయపరిజ్ఞానం పెంపొందించుకుంటారని, తలదించుకొని చదివినప్పుడే తల ఎత్తుకొని జీవించేలా పుస్తకాలు విద్యార్థులను తయారు చేస్తాయన్నారు.కార్యక్రమ ఇన్చార్జి డాక్టర్ రాచమళ్ళ శ్రీను మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలతో పాటు ఉన్నత విద్యను అభ్యసించడానికి కావలసిన పుస్తకాలు గ్రంథాలయంలోఉన్నాయని వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుశాఖ అధ్యక్షులు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, తండు సాయన్నదాసు రాసిన సాయన తత్వాలు పుస్తకాన్ని సమీక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జె.చిన్నబాబు, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీ నీలిమ, పరిపాలనాధికారి జి.కరుణాకర్, అధ్యాపకులు డాక్టర్ రత్నమంజుల, డాక్టర్ జి.సునీత, డాక్టర్ సిహెచ్.వెంకట్ గౌడ్, ఎం.అనిత, డాక్టర్ డి.కిషన్, డాక్టర్ ఎం.రవీందర్ రావు, టి.శ్రీనివాస్, జె.నరేశ్, రవి, ఆంజనేయులుతో పాటు కార్యాలయ సిబ్బంది ఫయాజ్, షరీఫ్, శ్రీదేవి, నాగరాజు, బసవయ్య రాంబాబు, నవీన్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



## ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** వీజి గ్రామ్ జీ చట్టాన్ని రద్దు చేయాలని ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాతీయస్థాయిలో ఐఎన్‌టియుసి సెంట్రల్ ట్రేడ్ యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు మహాత్మాగాంధీ జాతీయ హామీ పథకాన్ని రక్షించుకుందాం అంటూ నూతనంగా తీసుకవచ్చిన వీజీ గ్రామ్ జీ చట్టాన్ని రద్దు చేయాలనే నినాదంతో శుక్రవారం హుజూర్‌నగర్ మండలంలోని శ్రీనివాసపురం, అమర్‌నగర్, గోపాలపురం గ్రామాలలో ఐఎన్‌టియుసి నాయకులు, తెలంగాణ అగ్రికల్చర్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి, యూనియన్ అధ్యక్షులు యరగాని నాగన్నగౌడ్ ఉపాధి హామీ కూలీలను ఉద్దేశించి మాట్లాడారు. సోనియాగాంధీ, మన్మోహన్ సింగ్‌ల నాయకత్వాన పట్టణాలకు వలసలు నివారించాలనే ఉద్దేశ్యంతో ఉపాధి హామీ చట్టాన్ని రోజువారి కూలీ 700 రూపాయలకు పెంచాలని, ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి నాయకులు బెల్లకొండ గురవయ్య, ప్రధాన కార్యదర్శి గుంటుక కరుణాకర్‌రెడ్డి, చి ట్యాల అమరనాథ్ రెడ్డి, సలిగంటి జానయ్య, చింతకాయల రాము, బాలసైదులు, చంద్రకళ, రవి పాల్గొన్నారు.

## బండి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని రాస్తారోకో

**ప్రజాపక్షం/మోటకొండూర్ :**బండి భగీరథను వెంటనే అరెస్టు చేయాలి అని మోటకొండూరు మండల సిపిఐ కార్యదర్శి గాదగాని మాణిక్యం డిమాండ్ చేశారు. ఆయన మోటకొండూరు మండలంలోని ముత్తిరెడ్డిగూడెంలో రాయగిరి మోత్కూరు ప్రధాన రహదారిపై రాస్తా రోకో నిర్వహించారు. భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్లు ) మండల కార్యదర్శి మంచాల రాధమ్మ, సిపిఐ మండల కార్యదర్శి గాదెగాని మాణిక్యం నేతృత్వంలో పార్టీ కార్యకర్తలు రోడ్డుపై నిరసన తెలుపుతూ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. ఈ సందర్భంగా గాదెగాని మాణిక్యం మాట్లాడుతూ రాజకీయ పలుకుబడితో సామాన్య విద్యార్థులపై దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్యంలో క్షమించరాని నేరమని మండిపడ్డారు. బండి భగీరథునిపై కేసు నమోదైనప్పటికీ పోలీసులు అరెస్ట్ చేయడంలో జాప్యం చేయడం వెనుక అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. చట్టం ముందు అందరూ సమానులేనని, నిందితుడిని తక్షణమే రిమాండ్ కు తరలించాలని డిమాండ్ చేశారు. నిందితునిపై కఠిన చర్యలు తీసుకోకపోతే మండల వ్యాప్తంగా ప్రజా సంఘాలను ఏకం చేసి భారీ ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యవర్గ సభ్యులు బొడిగే దర్శన్, ముసుకు పెంట రె డ్డి ,పసుల నర్సింహ, మహిళా సంఘ నాయకులు మంచాల పద్మ, బండి అనసుర్య, దుషెటి ఆండాలు, మంచాల సుదర్శన్, గుర్రాల రాములమ్మ పాల్గొన్నారు



## వెంకటగిరి ఆలయ చైర్మన్‌ను సన్మానించిన మండల నాయకులు

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి మండలంలోని వెంకటాపురం వెంకటగిరి స్వయంభూ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో నూతనంగా ఎన్నికైన ట్రస్ట్ బోర్డు నూతన చైర్మెన్,పాలక మండలి ప్రమాణస్వీకారం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు ఎరుకల వెంకటేష్ గౌడ్ ఆలయ చైర్మెన్ గుంటి మహేష్ యాదవ్, పాలక మండలి సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దత్తాయపల్లి గ్రామ సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్, మండల అధ్యక్షుడు శంకర్ నాయక్, ఓబీసీ సెల్ జిల్లా కో ఆర్డినేటర్ దేవరుప్పల ఐలయ్య, దత్తాయపల్లి, వెంకటాపూర్ గ్రామ శాఖ అధ్యక్షులు దేవరుప్పల మల్లేష్, రాగుల శ్రీనివాస్, ఉప సర్పంచ్ జిట్టా కిషన్ యాదవ్, వార్డు నెంబర్ ధ్యానబోయిన నవీన్, నాయకులు గుంటి మల్లేష్ యాదవ్, ధ్యానబోయిన కరుణాకర్, కొడారి పరమేశ్, భగవంతు, ధ్యానబోయిన పోచయ్య, గొప్ప కొండల్ రెడ్డి, గొప్ప హనుమంత్ రెడ్డి, ధ్యాన బోయిన వెంకటేష్, కొడారి నాగరాజు తదితరులు ఉన్నారు.




## గ్యాస్ ఏజెన్సీ నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలి

సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :**ప్రజలకు సమయానికి గ్యాస్ సిలిండర్ అందించకుండా తీవ్ర నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని స్థానిక తహసిల్దార్ పల్నాడు శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. బుకింగ్ చేసినప్పటికీ రోజుల తరబడి సిలిండర్లు సరిపడా చేయడం లేదని ఏజెన్సీ కార్యానికి వెళ్లిన సరైన సమాధానం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల గ్యాస్ ధరలు పెరిగిన నేపథ్యంలో జాప్యం ప్రజలకు మరింత ఇబ్బందిగా మారిందన్నారు గ్రామీణ ప్రాంతాల్లో వృద్ధులు మహిళలు గ్యాస్ కోసం పలుమార్లు ఏజెన్సీ చుట్టూ తిరగాల్సి వస్తుందని తెలిపారు. కొంతమంది డెలివరీ సిబ్బంది అదనపు చార్జర్ వసూలు చేస్తున్నారని ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. గ్యాస్ సరఫరా పారదర్శకంగా నిర్వహించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా సరపర చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మారగోని నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా గుండ్లపహాడ్ దర్గా ఉర్సు ఉత్సవాలు

**ప్రజాపక్షం/పాలకవీడు:** గుండ్ల పహడ్ దర్గా ఉర్సు ఉత్సవాలలో భాగంగా హజరత్ సయ్యాదినా షేక్ ముస్తాఫా ఖాద్రి గంధం మహోత్సవంలో మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఎంపిపి భూక్య గోపాల్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మాలోతు మోతిలాల్ నాయక్ దర్గాలో చాధర్ కప్పి గంధం ఎక్కించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం దర్గా ముజావార్ సయ్యద్ హుస్సేన్ బాషా వారికి దట్టి కప్పి బాబా గారి తీర్థప్రసాదాలు వారికి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాఘవపురం సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ సైదులు, గుండ్ల పహడ్ ఉప సర్పంచ్ ఎండి వాజిద్, వార్డు సభ్యులు మట్టయ్య, నర్సింహరావు పాల్గొన్నారు.

## విబిజి రామ్‌జీ చట్టాన్ని రద్దు చేయాలి

**ప్రజాపక్షం/నడిగూడెం:** కేంద్ర ప్రభుత్వం విబిజీ రాంజీ చట్టాన్ని రద్దు చేయాలని సిపిఎం గ్రామ కార్యదర్శి కన్నేబోయిన సైదయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రత్నవరం గ్రామంలో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కమిటి పిలుపులో భాగంగా గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బంద్ చేయించారు. ఈ సందర్భంగా కూలీలనుద్దేశించి మాట్లాడుతూ ఆనాడు యుపిఎ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ పేదలకు ప్రతి కుటుంబానికి వందరోజుల పని గ్యారెంటీ చేస్తూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని 2005లో ఆమోదించిందని అన్నారు. నేడు బిజేపి ప్రభుత్వం ఆ పథకాన్ని రద్దు చేస్తూ విబిజి రాంజీ పథకాన్ని ప్రవేశపెట్టిందని దీనిని రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పొలంపల్లి రాజు, బత్తుల సత్యనారాయణ, వెలుగూరి పిచ్చమ్మ, సంధ్య, కుక్కడపు సైదమ్మ, మిర్యాల వెంకన్న, వీరలక్ష్మి , కన్నెబోయిన అనసూర్య, బండారు పద్మ పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు వారికే ఇవ్వాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాష్ట్రంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు గతంలో పనిచేసిన పెండింగ్ బిల్లుల విషయంలో పాత సర్పంచ్‌లను ఇబ్బందులు పెడుతుండడం సరికాదని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ అన్నారు. గురువారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో గత పాలకవర్గాలు గతంలో చేసిన పనులకు బిల్లులు ఇచ్చేందుకు కొత్త పాలకవర్గం వారు పాత బకాయిల బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. గతంలో పంచాయతీల్లో సొంత డబ్బులు పెట్టి అప్పులు చేసి మరీ పనులు చేయించగా నిధులు రాకపోవడంతో ఇన్ని సంవత్సరాలు ఇబ్బందులు పడ్డారని ఇప్పుడు పడ్డప్పుడు కూడా ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. ఇప్పటికైనా సంబందిత అధికారులు జోక్యం చేసుకోని పాత పాలకవర్గాలు చేసిన పనులకు సంబంధించిన బిల్లులను ఆమోదం తెలిపేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## ఉపాధి హామీ చట్టం పద్ధ-తిని కొనసాగించాలి



**ప్రజాపక్షం/అర్వపల్లి :** ఉపాధి హామీ చట్టాన్ని పాత పద్ధతిలో కొనసాగించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు శిగ శ్రీను అన్నారు. శుక్రవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కార్మికులతో కలిసి ఉపాధి హామీ పని ప్రదేశంలో నిరసన తెలిపారు. గతంలో ఉన్న ఉపాధి హామీ పనుల్లో సరైన పనులు, వసతులను ఏర్పాటు చేశారన్నారు. నేడు 2026 కొత్త పథకం మూలంగా సౌకర్యాలు రద్దు చేయడంతో పాటు ఉపాధి హామీల పనులను కల్పించడం లేదన్నారు. వెంటనే కొత్త పథకాన్ని రద్దు చేసి 2005 పాత చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు రవి, మల్లమ్మ, వెంకన్న, పుల్లయ్య పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

**ప్రజాపక్షం/అర్వపల్లి :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండలంలోని జాజిరెడ్డిగూడెం గ్రామంలోని గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బింగి కృష్ణమూర్తి మాట్లాడుతూ గ్రంథాలయాలు జ్ఞానబండాగారాలని ప్రజలకు సమాజానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. గ్రంథాలయాలను నేటి విద్యార్థులు యువత సద్వినియోగం చేసుకొని తమ ప్రతిభను, మేదస్సు, జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డుమెంబర్లు అయ్యన్న నర్సమ్మ, మహేశ్వరి సందీప్, యాదగిరి, దీపిక సురేష్, కీర్తి వెంకటేశ్వర్లు, కార్యదర్శి అశోక్, మాగి నాగయ్య, లైబ్రేరియన్ శ్రీనివాస్, నాగరాజు పాల్గొన్నారు.

## జిల్లా టాపర్‌కు ఎమ్మెల్యే శుభాభినందనలు

**ప్రజాపక్షం/రామన్నపేట :**రామన్నపేట పట్టణ కేంద్రానికి చెందిన రాపోలు ఉపేందర్ కుమార్తె రాపోలు అంజని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఖ్యాతిని జిఎంఎల్ టి గ్రూపులో జిల్లాస్థాయి ప్రథమ స్థానంలో 971 మార్కులు సాధించినందుకు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం విద్యార్థినికి శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. విద్యలో ఉన్నత స్థానానికి ఎదగాలని ఎల్లవేళలా తమ వంతు సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏటెల్లి శ్రీనివాస్, రాపోలు ఉపేందర్, బోదాసు రవి తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయం పై రైతులకు పలు సూచనలు

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి :** వ్యవసాయంపై మండల వ్యవసాయ అధికారి జానకిరాములు పెండ్లిపాకుల గ్రామ రైతులకు శుక్రవారం పలు సూచనలు చేశారు. రైతులకు వద్దకు వెళ్ళి వరి కోతల అనంతరం వరి పొలాల్లో మిగిలే వరి కొయ్యలు, అవశేషాలను, ఇతర వ్యర్థ పదార్థాలను కాల్చడం ద్వారా కాలుష్యం పెరిగి భూమిలో సారం తగ్గుతుందని రైతులకు సూచించారు. రైతులకు మేలు చేసే వానపాములు, సూక్ష్మ జీవులు వంటివి నశించిపోతాయని అన్నారు. కొయ్యలను కాల్చడం ద్వారా వేలువడే పొగ వలన శ్వాసకోశ సమస్య లు తలెత్తుతాయని సూచించారు. భూమి గట్టిపడి నీటిని నిల్వ చేసే సామర్థ్యం కొల్పోతుందని అన్నారు. వానాకాలంకు సంబంధించి వ్యవసాయ శాఖ సూచించిన బిపిటి 5204, తెలంగాణ సోనా, జై శ్రీరాం హెచ్ఎంటి, విజిఎల్, జేజీఎల్ వంటి వరి రకాలు మాత్రమే సాగు చేయాలని, వీటికి మాత్రమే బోనస్ లభిస్తుందని రైతులకు సూచించారు. ఈకార్యక్రమంలో ఏఈవో సురేష్, పెండ్లిపాకల గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుతోపాట క్రీడల్లో రాణించాలి

### ఎమ్మెల్సీ శంకర్‌నాయక్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** విద్యార్థులు చదువుల్లోనే కాకుండా క్రీడల్లో రాణించి మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించాలని ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో బీఎల్ఆర్ బ్రదర్స్, ఎన్‌వీఆర్ ట్రస్ట్‌ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌కు ఆయన హాజరై విద్యార్థులకు క్రీడాదుస్తులు, అల్పాహారం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతిరోజు రూ.5వేల విలువ చేసే అల్పాహారం అందించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్‌కు అలవాటు పడి శారీరక ఆరోగ్యంపై దృష్టి పెట్టడం లేదన్నారు. ఇలాంటి సమ్మర్ క్యాంపులను ఉపయోగించుకోని శారీరక ఫిట్నెస్‌ను సాధించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎన్‌వీఆర్ ఫౌండేషన్ ఛైర్మన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా కిసాన్‌సెల్ అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, కౌన్సిలర్లు అడావత్ అశోక్, సైదులు, నాయకులు జానకిరాంరెడ్డి, గుడిపాటి కృష్ణ, కన్నెబోయిన వెంకటేశ్వర్లుయాదవ్, పీడీలు, కోచ్‌లు నాగరాజు, అశోక్‌చారి, భీమేష్, లక్ష్మణ్, సతీష్, మహేష్, జనార్థన్‌రెడ్డి పాల్గొన్నారు.

## గాంధీజీ విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/చండూరు:** ఇటీవల ప్రకటించిన పదవ తరగతి ఫలితాలలో చండూరు మున్సిపాలిటీకి చెందిన గాంధీజీ విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి 588/600 మార్కులతో కారింగు దీక్షిత మునుగోడు నియోజకవర్గం మొదటి ర్యాంకును సాధించినందులకు గాను స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి శాలువా కప్పి,పుష్పగుచ్ఛమును అందించి ఘనంగా సన్మానించి,అభినందించారు.అలాగే 580 మార్కులు సాధించిన శిరంశెట్టి అక్షరను,579 మార్కులు సాధించిన కందుల దివ్యను,575 మార్కులు సాధించిన తుమ్మల జయశ్రీని,573 మార్కులు సాధించిన ఆలేటి శిరీషను ,572 మార్కులు సాధించిన భూతరాజు ఐశ్వర్యను,571 మార్కులు సాధించిన నారాబోయిన కుమార స్వామిలందరిని అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ గాం zధీజీ విద్యాసంస్థలు గత సంవత్సరం 590 మార్కులతో జిల్లా మొదటి ర్యాంకులు సాధించి,మళ్లీ ఈ సంవత్సరం కూడా 588 మార్కులను సాధించి మునుగోడు నియోజకవర్గంలో మొదటి స్థానంలో ఉండడం గర్వకారణం అని అన్నారు.విద్యార్థులందరూ బాగా కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని,పుట్టిన ఊరుకు,కన్న తల్లిదండ్రులకు,చదివిన పాఠశాలకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు.విద్యార్థులకు ఉత్తమ విద్యను అందిస్తున్న గాంధీజీ విద్యాసంస్థల యాజమాన్యంను, ఉపాధ్యాయ బృందంను అభినందించారు.ఈకార్యక్రమంలో గాంధీ జీ విద్యాసంస్థల చైర్మన్, చండూరు మున్సిపల్ చైర్మన్, ట్రస్మా జిల్లా అధ్యక్షులు డాక్టర్ కోడి శ్రీనివాసులు, డైరెక్టర్లు సరికొండ వెంకన్న,కర్నాటి నాగరాజు, ప్రిన్సిపల్ కందుల కృష్ణయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ముందు హామీలు ఎన్నికల తర్వాత భారాలు



**ప్రజాపక్షం/నందికొండ:** కేంద్ర ప్రభుత్వం వరుసగా పెంచుతున్న పెట్రోల్, డీజిల్ ధరలకు నిరసనగా బిఆర్ఎస్ నాయకులు వినూత్న ఆందోళన చేపట్టారు. పెరిగిన ఇంధన ధరలతో సామాన్య ప్రజలు, ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆటోను తాడుతో లాగుతూ నిరసన తెలుపుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఖండించారు. ఎన్నికల ముందు ప్రజలపై ప్రేమ చూపించిన కేంద్ర ప్రభుత్వం, ఎన్నికలు పూర్తయ్యాక ధరల భారంతో సామాన్యుడి నడ్డివిరుస్తోందని విమర్శించారు. పెరుగుతున్న పెట్రోల్ ధరల కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు కూడా ఆకాశాన్ని తాకుతున్నాయని, దీనితో పేద మరియు మధ్యతరగతి ప్రజల జీవితం భారంగా మారిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోలు డీజిల్ ధరలకు నిరసనగా నందికొండ మున్సిపాలిటీ బిఆర్ఎస్ ఆధ్వర్యంలో పైలాన్ కాలనీ బైపాస్‌లో ఆటోను తాళ్లతో లాగి నిరసన తెలియజేయడం జరిగింది పెంచిన ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మాజీ కౌన్సిలర్ హీరేకార్ రమేష్ జి,స్థానిక నాయకులు చంద్రమౌళి, శేఖరాచారి, లక్ష్మణ్, నజీర్, తిమ్ములు, రవి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## వరికుప్పల ఇద్దయ్య ఆశయాల సాధనకు కృషి చేయాలి



**ప్రజాపక్షం/చండూరు/గట్టుపల్:** అమరజీవి వరికుప్పల ఇద్దయ్య ప్రథమ వర్ధంతిని గట్టుప్పల్ మండల కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈసందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి భీమనపల్లి రమేష్ మాట్లాడుతూ వరికుప్పల ఇద్దయ్య కలలుగన్న సమాజం కోసం పనిచేసినప్పుడే ఆయన ఆశయాలు సాధించినట్లవుతుందన్నారు. ఈప్రాంతంలో పేదలు,అణగారి న వర్గాల కోసం ఆయన అనేక పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు. వరికుప్పల ఇద్దయ్య మరణం సిపిఐకి, ఈ ప్రాంతానికి తీరనిలోటని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు చలం పాండురంగారావు, కలకొండ సంజీవ,సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు లింగస్వామి, రాపోలు సత్తయ్య,అయిత రాజు లక్ష్మయ్య, టౌన్ సెక్రటరీ కారింగ్ శ్రీను, దుబ్బాక రాములు, సీనియర్ నాయకులు కట్ట చెన్నయ్య, బాలిమ్ లింగయ్య, సుధాకర్ రెడ్డి, కొండపల్లి ముత్యాలు, పల్లె గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎస్ఐని సన్మానించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** నూతనంగా గరిడేపల్లి ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్‌గౌడ్‌ను శుక్రవారం మండల పరిధిలోని కీతవారిగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ, సమాజ వ్యతిరేక శక్తులను అరికట్టడం, యువతను చెడు మార్గాలకు దూరంగా ఉండేలా చూస్తామని అన్నారు. ప్రజలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడు అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్‌కె చాంద్‌మియా, కీత సోమయ్య, నర్సింగ్ వెంకటేశ్వర్లు, చిత్తలూరి వీరస్వామి, షేక్ మీరా, బండారు సైదులు పాల్గొన్నారు.

## మైసయ్య కుటుంబానికి బియ్యం పంపిణీ

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :**మండలంలోని పొట్లపహాడ్ గ్రామంలో శుక్రవారం నిరుపేద కుటుంబానికి బియ్యం పంపిణీ చేశారు. ఇటీవల మరణించిన కిన్నెర మైసయ్య కుటుంబ సభ్యులను స్థానిక ప్రజాప్రతినిధులు, దాతలు పరామర్శించారు. శోకంలో ఉన్న ఆ కుటుంబానికి యగ్గడి గురవయ్య కుమార్తె అల్లుడు కోట లావణ్య నరేష్ దంపతులు మానవతా దృక్పదంతో 25 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఆపద సమయంలో స్పందించి నిరుపేద కుటుంబానికి సహాయం అందించిన దాతలకు గ్రామసత్తు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు మేకపోతుల దుర్గ జానయ్య, గోకాని ఇందిరమ్మ మల్లికార్జున్, పుట్టల శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

**ప్రజాపక్షం/నడిగూడెం:** ఉపాధి హామీ కూలీలు ఎండల తీవ్రత వల్ల ఉదయాన్నే పనులకు వెళ్లాలని ఉప సర్పంచ్ కొత్తపల్లిరమేష్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలించి అనంతరం కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అందే విధంగా కూలీలకు టెంట్, మంచినీళ్ల సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ జంపాల వెంకన్న, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, మేధస్సును బలోపేతం చేయడానికి, వారి ప్రగతికి గ్రంథాలయాలు తోడ్పడుతాయని, గ్రంథాలయాలు ఆధునీక దేవాలయాలని కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మలిగిరెడ్డి భీమార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం విద్యా వారోత్సవాల్లో భాగంగా మన కళాశాల జ్ఞాన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పుస్తకాలను చదవడం ద్వారానే ఉత్తమమైన జీవితాన్ని నిర్మించుకుంటారని, ఉత్తమ పాఠకులే ఉత్తమ సమాజాన్ని నిర్మించగలుగుతారని, గ్రంధాలయాలే విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకాని అన్నారు. అనంతరం కళాశాల గ్రంథాలయానికి పుస్తకాలు, కుర్చీలు బహూకరించిన దాతలైన రాఘవరెడ్డి, మాజీద్‌లను సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం



ప్రజాపక్షం/గుండాల : యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం పెద్దపడిశాల గ్రామానికి చెందిన మహమ్మద్ గోరేబి మరణించడంతో మానవసేవే మాధవసేవ అనే నినాదంతో ముందుకెళుతున్న మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ చైర్మన్ మబ్బు మహేష్ గోరేబి కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించి రూ. 5వేలు ఆర్థిక సాయంగా అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మణికంఠ ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచ్ మల్లేష్, వార్డు సభ్యులు పురుషోత్తం, వైస్ చైర్మన్ భరత్, కోశాధికారి విక్రమ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామ్‌పికే, పరశురాములు, మధన్‌మోహన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# కనకదుర్గ ఆలయ హుండీ లెక్కింపు



ప్రజాపక్షం/నకిరేకల్ : మండలంలోని నోముల గ్రామ విజయ కనకదుర్గ ఆలయంలో శుక్రవారం హుండీ లెక్కింపు జరిగింది.ఈలెక్కింపులో రూ 1,15,310 నగదు,18 వెండి కళ్ళు,మూడు వెండి తొట్టెలు,ఒక ముక్కుపుడక,ఒక కాలు మెట్టె, ఒకటి బంగారం ముక్కుపుడక, ఒకటి బంగారం పూస్తే వచ్చినట్లు ఆలయ శాశ్వత చైర్మన్ ముసుకు స్టాలిన్ రెడ్డి,అధ్యక్షుడు కోమటిరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు.ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పొట్ట బత్తుల జయమ్మ వెంకటేశం,మార్కెట్ కమిటీ డైరెక్టర్ వరకాంతం శేఖర్ రెడ్డి,దేవాలయ కమిటీ సభ్యులు భీమనబోయిన వెంకటయ్య,కొడదల లింగయ్య, లగిశెట్టి శ్రీనివాసులు,ఆలగడప సైదులు,దేశ గాని వేణు కుమార్,శ్యామల పురుషోత్తం,ఆలకుంట్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోళ్లు చేయకపోవడంతో పేరుకుపోయిన ధాన్యం నిల్వలు

## త్వరతిగతిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి



ప్రజాపక్షం/గుండాల : యాదాద్రి భువనగిరి జిల్లా గుం డాల మండల కేంద్రంలోని స్థానిక పిఏసిఎస్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు గిరికత్తుల శ్రీనివాస్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకుందామని పిఏసిఎస్, ఐకెపి కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే నేటికి 20 రోజులు దాటిన రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేయకపోవడంతో కేంద్రాల్లో ధాన్యం పేరుకుపోయి రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితి నెలకొంది. రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేయకుండా తేమ పేరుతో, తాలు పేరుతో నిలిపివేస్తుండడంతో రైతులు ధాన్యాన్ని కొనుగోలు చేసే వరకు కేంద్రాల వద్దే పడిగాపులు కాయాల్సి వస్తుంది. రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడ ంతో అకాల వర్షాలు కురిస్తే రైతులు తీసుకువచ్చిన ప ంట పూర్తిగా తడిసి మొలకెత్తే పరిస్థితి వస్తుందని అప్పుడు రై తన్న నిండా మునిగి నష్టాల పాలు కావాల్సిందే అని ఆయ న ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యా న్ని అధికారులు కొనుగోలు చేయకుండా గన్ని బ్యాకులు కొరత, లారీల కొరత అంటూ తీవ్ర జాప్యం చేస్తున్నారని తక్షణమే ప్రభుత్వం, అధికారులు స్పందించి కేంద్రాల్లో ని లిచిపోయిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# సొంతింటి కల సాకారం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం



ప్రజాపక్షం/హాలియా : సొంత ఇంటి కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేద కుటుంబాల కలను కాంగ్రెస్ ప్రభుత్వం సాకారం చేస్తోందని హాలియా మున్సిపల్ నాయకుడు గౌనీ రాజా రమేష్ యాదవ్ అన్నారు.శుక్రవారం హాలియా పట్టణంలోని 6వ వార్డులో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఇంటి యజమానులకు శుభాకాంక్షలు తెలియజేసి గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌనీ రాజా రమేష్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. ముఖ్యంగా సొంత ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా గౌరవప్రదమైన నివాసాన్ని కల్పించడం జరుగుతోందని తెలిపారు.ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి అర్హులైన పేద కుటుంబానికి ఇల్లు అందే లా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, గ్రామాలు, పట్టణాల్లో ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో 6వ వార్డు కౌన్సిలర్ బొంగరాల యేసు రాజు,9వ వార్డు కౌన్సిలర్ చెరుపల్లి ముత్యాలు,నాయకులు నకిరేకంటి సైదులు తదితరులు పాల్గొన్నారు.

# బండి భగీరథ్‌ను అరెస్ట్ చేయాలి



ప్రజాపక్షం/నకిరేకల్ : మైనర్ బాలికపై లైంగిక వేధింపుల ఆరోపణలతో నమోదైన పోక్సో కేసులో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం నకిరేకల్ పట్టణ కేంద్రంలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోక్సో కేసు నమోదై ఏడు రోజులు గడిచినా నిందితుడిని అరెస్ట్ చేయకపోవడం దుర్మార్గమన్నారు. నిందితుడిని అరెస్ట్ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం బీజేపీకి బీటీమ్‌లా పనిచేస్తోందని ఆరోపించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సీఎం రేవంత్ రెడ్డి అండదండలతో కేసును నీరుగార్చే ప్రయత్నం జరుగుతోందన్నారు. బాధిత బాలిక కుటుంబానికి పూర్తి రక్షణ కల్పించి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. బండి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయడంతో పాటు ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ బండి సం జయ్ కేంద్ర సహాయ మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బేటీ బచావోబేటీ పడావో,నారీ శక్తి సమ్మాన్ అంటూ ప్రచారం చేసే బీజేపీ నాయకులు ఇలాంటి ఘటనలపై తమ వైఖరిని స్పష్టం చేయాలని అన్నారు.ఈకార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్ గౌడ్,మాజీ జెడ్పిటిసి మాద ధనలక్ష్మి నాయకులు మారం వెంకట్ రెడ్డి,రాచకొండ వెంకన్న గౌడ్,రావిరాల మల్లయ్య, పల్లె విజయ్,సామ శ్రీనివాస్ రెడ్డి,పెండ్యం సదానందం,పేర్ల కృష్ణకాంత్,జి.జంగయ్య, రమేష్,శ్రీనివాస్,యం.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# చైర్మన్‌లను ఎన్నిక ద్వారానే నియమించాలి



ప్రజాపక్షం/మునుగోడు : సహకార సంఘాల చైర్మన్‌లను నామినేటెడ్‌గా కాకుండా ఎన్నిక ద్వారా నియమించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురిజ రామచంద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 ప్రకారం సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో తాహసిల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ద్వారా కాకుండా సహకార సంఘాల చైర్మన్‌లను నామినేటెడ్‌గా నియమించడా న్ని మేము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. నామినేషన్ల ద్వారా నియమిస్తే పాలక పార్టీ తన ఇష్టానుసారం నియామకా లు చేసుకునే అవకాశం ఉంటు ం ది. దీనివల్ల సహకార సంఘాలు నిర్వీర్యమ య్యే ప్రమాదం ఉంది అని అన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సిపిఐ మండల కార్యదరి పాల్గొన్నారు.

# బండి భగీరథ్‌ని వెంటనే అరెస్టు చేయాలి




ప్రజాపక్షం/దేవరకొండ : కేంద్ర హోంశాఖ స హాయ మంత్రి బండి స ంజయ్ కుమారుడు బండి భగీరథ్ ని వెంటనే అరెస్టు చేయాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) జిల్లా కన్వీనర్ గిరి రమ అన్నారు. శుక్రవారం పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో జరిగిన భారత జాతీయ మహిళా సమాఖ్య సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన జిల్లా కన్వీనర్ గిరి రమ మాట్లాడుతూ మైనర్ బాలికను లైంగిక వేధింపులకు గురిచేసి బలవంతంగా మద్యం తాగించి ఫామ్ హౌస్‌లో అత్యాచారానికి పా ల్పడిన బండి భగీరథ్‌ను కఠినంగా శిక్షించాలని, బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అతనిపై ఫోక్సో చట్టం కింద వెంటనే అరెస్టు చేసి జైలుకు పంపాలన్నారు. ఈ సంఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ వెంటనే రాజీనామ చేయాలని సదరు బాలికకు న్యాయం జరగకపోతే ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని భారత జా తీయ మహిళా సమాఖ్య తరుపున ఆమె డిమాండ్ చేశారు. ఈ సమావేశ ంలో మహిళా సమాఖ్య డివిజన్ అధ్యక్షురాలు లింగంపల్లి అనిత, పద్మ, లక్ష్మీ పాల్గొన్నారు.

# అమరుల వారోత్స వాలుగా వీరన్న వర్ధంతి సభలు



ప్రజాపక్షం/నకిరేకల్ : మారోజు వీరన్నతో పాటు అమరులైన 150 మంది కామ్రేడ్స్ వర్ధంతి సభలను గ్రామగ్రామాన అమరుల వారోత్సవాలుగా నిర్వహించాలని బహుజన కమ్యూనిస్టు పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని ఇటుకులపాడు గ్రామంలో పిడిఎస్‌యూ మాజీ రాష్ట్ర కార్యదర్శి నల్ల జగదీష్ విగ్రహం వద్ద శుక్రవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బిసిపి నల్లగొండ జిల్లా నాయకులు బొల్లికొండ లింగయ్య యాదవ్ మాట్లాడుతూ మారోజు వీరన్న కుల అస్తిత్వ ఉద్యమాలు, వర్గ పోరాటాలను ఏకతాటిపైకి తీసుకొచ్చారని పేర్కొన్నారు. అణగారిన వర్గాల ఐక్యత కోసం మహాజన ఫ్రంట్ ఏర్పాటు చేశారని తెలిపారు. మార్క్సిస్టులు, అంబేద్కరిస్టులు కలిసి పోరాడితేనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఎంఎస్ జిల్లా కన్వీనర్ చెట్టుపల్లి కాశీరాం మాదిగ, బిసిఆర్ఎస్ నాయకులు గుత్తా వెంకట్‌రెడ్డి,న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సాగర్, గజ్జి రవి, బూరుగు సత్తయ్య, అక్కినపల్లి శ్రీరాములు, సాధుర నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



ప్రజాపక్షం/నకిరేకల్ : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, పుస్తక పఠనం విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి,ఉన్నత లక్ష్యాల సాధనకు తోడ్పడుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు ప్రొఫసర్ బెల్లి యాదయ్య అన్నారు.విద్యావారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కళాశాల, శాఖా గ్రంథాలయం సంయుక్తంగా నిర్వహించిన గ్రంథాలయోత్సవంలో ఆయన మాట్లాడారు. తరగతి గది పాఠాలతో పాటు గ్రంథాలయంలో అదనపు విజ్ఞానం సంపాదించాలని,ఖాళీ సమయాన్ని పఠనానికి కేటాయించాలని విద్యార్థులకు సూచించారు.శాఖా గ్రంథాలయాధికారి వి. రవికుమార్ మాట్లాడుతూ మూసీ రోడ్డులోని నూతన భవనంలో అన్ని సౌకర్యాలతో గ్రంథాలయం అందుబాటులో ఉందని తెలిపారు. ఈ సందర్భంగా విశ్రాంత అధ్యాపకుడు చందా దయాకర్ లైబ్రరీకి 100 పుస్తకాలు విరాళంగా ఇచ్చారు. అనంతరం పుస్తక ప్రదర్శన, వ్యాసరచన విజేతలకు బహుమతుల ప్రదానం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి లైబ్రేరియన్, అధ్యాపకుడు మధుసూదన్‌రెడ్డి,వైస్ ప్రిన్సిపాల్ నాగు,అధ్యాపకులు ప్రవీణ్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాసాచారి, శ్రీనివాస్, హరిత, డాక్టర్ శంకర్, శివశంకర్, నర్సింహాచారి పాల్గొన్నారు.

# కార్మికుల పరిరక్షణకు కృషి

ప్రజాపక్షం/నకిరేకల్ : విద్యుత్ కార్మికుల హక్కుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రతకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.శుక్రవారం పట్టణంలోని విద్యుత్ ఉపకేంద్రంలో నిర్వహించిన ఐఎన్‌టీయూసీ 327 జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. విద్యుత్ శాఖ ఉద్యోగులు ప్రజలకు నిరంతరాయ సేవలు అందిస్తున్నారని కొనియాడారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పన్నాల రాఘవరెడ్డి గుత్తా మాధవరెడ్డి, చౌగోని శ్రీనివాస్, కంపెనీ జాయింట్ సెక్రెటరీ ఎండి.అబ్బా సాలి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి సమ్మిరెడ్డి, డివిజన్ కార్యదర్శి పాండు, సబ్ డివిజన్ లీడర్స్ సిరికొండ శ్రీనివాస్,వెంకన్న,సెక్షన్ లీడర్ సంజీవ, కార్మికులు కొడిదల శ్రీనివాస్, బుచ్చి రాములు, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఎంజియులో విద్యా వారోత్సవాలు




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జరుగుతున్న విద్యా వారోత్సవాలలో భాగంగా,శుక్రవారం ఐదవ రోజు ఆర్ట్స్ బ్లాక్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫర్ ఎవ్రీవన్ అనే అంశంపై విశిష్ట ఉపన్యాసం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ వైస్‌చాన్సలర్ ప్రొఫసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్,రిజిస్ట్రార్ ప్రొఫసర్ కె. అంజి రెడ్డి,ఇన్ఫోసిస్,హైదరాబాద్‌కు చెందిన ఏఐ నిపుణులు డాక్టర్ కల్యాణ్ సర్వేపల్లి పాల్గొని,ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్,మెషిన్ లెర్నింగ్,జనరేటివ్ ఏఐ విద్య రంగంలో వినియోగంపై అందరికీ అర్థమయ్యే సరళమైన శైలిలో విశదీకరించారు.ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫసర్ ఆర్.రేఖ, అకాడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ వై.ప్రశాంతి, అసిస్టెంట్ ప్రొఫసర్లు, హరీష్ కుమార్, జయంతి, సంధ్యారాణి, సుధారాణి అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## వీలైనంత త్వరగా లారీలు అన్‌లోడ్ చేయాలి



**ప్రజాపక్షం/డిండి:**రైతులకు ఇబ్బంది కలగకుండా కొనుగోలు కేంద్రాలు ధాన్యం సేకరించి లారీలను లోడ్ చేసి మిల్లులకు తరలించిన అనంతరం మిల్లుల యజమానులు లారీలను రోజుల తరబడి కాలయాపన చేయకుండా వీలైనంత త్వరగా ఆన్‌లోడ్ చేసి లారీలను తిరిగి కేంద్రాలకు పంపాలని ఎంఎల్‌ఏ బాలునాయక్ అన్నారు. ఈమేరకు శుక్రవారం డిండి మండల కేంద్రంలోని చెరుకుపల్లి సాయిలక్ష్మీ ఇండస్ట్రీస్‌ను స్వయంగా లారీలు ఆన్‌లోడ్ చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. వీలైనంత త్వరగా ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని యజమాన్యం అలసత్వం వహిస్తే చర్యలు ఉంటాయని రైతులకు ఇబ్బందులు కలిగించే విధంగా కొనుగోలు కేంద్రాల్లో కానీ మిల్లర్లు కానీ లారీల యజమాన్యం కానీ అలసత్వం వహిస్తే చర్యలు ఉంటాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేశ్వర్‌రావు, తహశీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ బాలకృష్ణ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ శాఖ గౌరవాన్ని పెంచేలా పనిచేయాలి: ఎస్‌పి శరత్ చంద్ర పవార్

**ప్రజాపక్షం/త్రిపురారం:** పదోన్నతి అనేది హోదా పెరగడమే కాకుండా బాధ్యతలు కూడా పెరుగుతాయని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ అన్నారు.త్రిపురారం పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ రెడ్డి ఏఎస్‌ఐగా పదోన్నతి పొందిన సందర్భంగా శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయనకు స్టార్‌లు అందజేసి అభినందించారు.ప్రజలకు చేరువగా ఉంటూ ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వహించి శాఖ గౌరవాన్ని పెంచాలని కోరారు.పదోన్నతి పొందిన అధికారులు యువ సిబ్బందికి ఆదర్శంగా నిలవాలన్నారు.కార్యక్రమంలో పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు జయరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి :టియుడబ్ల్యుజె(ఐజెయు)



**ప్రజాపక్షం/తిప్పర్తి :**తిప్పర్తి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా లో శుక్రవారం టియుడబ్ల్యూజే (ఐజేయు) సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల జర్నలిస్టుల సంఘం అధ్యక్షులు బద్దం జానయ్య మాట్లాడుతూ జర్నలిస్టులో వృత్తి నిర్వహణ రోజురోజుకు సంక్లిష్టమవుతున్న దశలో అనేక ఆటుపోట్లను ఎదుర్కోవాల్సి వస్తుందని.సమస్యలను పరిష్కరించేందుకు అనువార్యంగా జర్నలిస్టులు అందరూ సంఘటితం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని. జర్నలిస్టుల సమస్యలపై సుదీర్ఘకాలంగా పోరాడుతూ అనేక సత్ఫలితాలను.విజయాలను సాధించిన జర్నలిస్టుల సంఘం టియుడబ్ల్యూజే (ఐజేయు) మండల స్థాయి నుండి.మున్సిపల్. డివిజన్ స్థాయి. జిల్లాస్థాయి.రాష్ట్ర శాఖలో కలుపుకొని జాతీయస్థాయిలోని అతిపెద్ద సంఘంగా విస్తరించి గ్రామీణ ప్రాంత విలేకరులు అక్రెడిషన్ సౌకర్యం,బస్సు పాసులు.ఇండ్లు మరియు ఇండ్ల స్థలాల కోసం.జర్నలిస్టుల సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనే దిశగా టియుడబ్ల్యూజే నిరంతరం విలేకరుల పక్షాన పోరాటం చేస్తుందని అన్నారు,ఈ కార్యక్రమంలో సీనియర్ రిపోర్టర్ పిజె విజయ్ , ప్రసాద్, మహమ్మద్ రషీద్., శిరసవాడ గిరి, మహ్మద్ జానీ, పాషా తదితరులు పాల్గొన్నారు.

## మా పాలనలో అవినీతి జరిగితే సహించేది లేదు

### ఏసీబీ దాడుల్లో వెలుగు చూసినవి మాకు సంబంధించినవి కావు

### మున్సిపల్ చైర్‌పర్సన్ చిలుకూరి సుధాబాలకృష్ణ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తాము అధికారంలోకి వచ్చి నాలుగు నెలల కాలం మాత్రమేనని గతంలో జరిగిన అవినీతి అక్రమాలకు మాకు ఎలాంటి సంబంధం లేదని అవన్ని గత ప్రభుత్వ కాలంలో జరిగిన పనులని, ఇటీవల జరిగిన ఏసీబీ దాడుల్లో సైతం వెలుగుచూసిన అంశాలన్ని ఆ కాలానికి సంబంధించినవేనని మిర్యాలగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ చిలుకూరి సుధాబాలకృష్ణ అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ మున్సిపాలిటి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ గుడిపాటి శిరీషతో కలిసి మాట్లాడారు. ఇటీవల జరిగిన ఏసీబీ దాడుల వల్ల ప్రజల్లో అనేక అపోహాలు ఉన్నాయని, వాటిని తొలగించి తమ పాలనబద్ధమైన అంశాలను, వాస్తవాలను తెలియచేయడం తమ బాధ్యత అన్నారు. ఇటీవల మున్సిపాలిటీలో అక్రమాలు , అవినీతి అంటూ తెలిపా రు. ఆ నిధులన్ని కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన నిధులని తెలిపారు. తమ పరిధిలో లేని అంశాల పట్ల తాము మాట్లాడలేమని, ప్రజలు ఎలాంటి అపోహాలు నమ్మవద్దని, నిజాయితీతో మిర్యాలగూడ మున్సిపాలి టి అభివృద్ధి కోసం పనిచేస్తున్నామని అన్నారు.

## ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి



**ప్రజాపక్షం/చండూరు:**ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు ని ర్వహించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సిపిఐ,తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్య ంలో శుక్రవారం తాహసిల్దార్ రమాకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పద్ధతిలో పాలక మండళ్లను నియమించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు.రాష్ట్రంలోని 908 సహకార సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.గత నెలలో రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు.ప్రతి సంఘంలో 13 మంది సభ్యులను నామినేట్ చేసే ప్రభుత్వ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని,ఆర్టికల్ 243. ప్రకారం ఎన్నికలు నిర్వహించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ,ఏఐకేఎస్ నాయకులు బండమీది వెంకన్న,తిప్పర్తి రాములు, పల్లె యాదయ్య, బరిగెల వెంకటేష్, చెడుబుద్ధి ఉషయ్య, పల్లె శంకరయ్య, శివర్ల లింగస్వామి, ఆలేటి జగన్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా డిగ్రీ కళాశాలలో పుస్తక ప్రదర్శన, కవుల సన్మానం




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** తెలంగాణ ప్రభుత్వ విద్యా వారోత్సవాల్లో భాగంగా 5వ రోజు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పుస్తక ప్రదర్శన, సమీక్ష, విరాళం,స్థానిక కవులురచయితల సన్మాన కార్యక్ర మం శుక్రవారం నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫసర్ కె.శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో, గ్రంథపాలకుడు డాక్టర్ ఎస్.రాజారాం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేసి ఉత్తమ గ్రంథాలయ సందర్శకులైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ గన్‌శ్యామ్ మాట్లాడుతూ ఇలాంటి కా ర్యక్రమాలతో గ్రంథాలయ ప్రాముఖ్యత పెరుగుతుందని, విద్యార్థులు పుస్తకాలతో స్నేహం చేస్తే సమాజ అభివృద్ధికి తోడ్పడతారన్నారు.నల్లగొండ కవులు మే రెడ్డి యాదగిరెడ్డి,బైరెడ్డి కృష్ణారెడ్డి, మనస్ వెం కన్న,అంబటి వెంకన్న,భాను శ్రీ కొత్వాల్ తమ పుస్తకాలను గ్రంథాలయానికి విరాళంగా ఇచ్చారు.అనంతరం కవులురచయితలను సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్. రాజారాం రచించిన నూతన పుస్తకాన్ని ఆవిష్కరించారు. డాక్టర్ శ్రీనివాసులు, అరవింద, వసంత, దయానంద్, సరిత తదితరులు పాల్గొన్నారు.

## మే 15 నుండి జూన్ 15 వరకు రెడ్ క్రాస్ మెంబర్షిప్ డ్రైవ్




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** తెలంగాణ రాష్ట్ర గవర్నర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు శివ్ ప్రతాప్ శుక్లా ఆదేశాల మేరకు జిల్లాలో రెడ్ క్రాస్ మెంబర్షిప్ డ్రైవ్ ప్రారంభమైంది.శుక్రవారం ఎస్‌పి శరత్ చంద్ర పవార్ కార్యాలయంలో ఎస్‌పి చేతుల మీదుగా,జిల్లా జాయింట్ కలెక్టర్,రెడ్ క్రాస్ వైస్ ప్రెసిడెంట్ జె.శ్రీనివాస్ కార్యాలయంలో డ్రైవ్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే 15 నుండి జూన్ 15 వరకు జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు ప్రతి ఒక్కరూ రెడ్ క్రాస్‌లో సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు.సేవా భావం ఉన్న ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకోవచ్చని తెలిపారు.కార్యక్రమంలో రెడ్ క్రాస్ మెంబర్షిప్ డ్రైవ్ ఇన్చార్జి,డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ పి.అరుణ,జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ పద్మజ,జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ గోలి అమరేందర్ రెడ్డి,ట్రెజరర్ డాక్టర్ మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి,యూత్ వాలంటీర్లు విప్లవ కుమార్,సద్దాం హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ సేఫ్టీ వీక్

### హెల్మెట్ అవగాహన ర్యాలీ



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** రహదారి భద్రతపై అవగాహన కల్పించేందుకు టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో శుక్రవారం రోడ్ సేఫ్టీ వీక్ కార్యక్రమం ఘనంగా జరిగింది.హెల్మెట్ ధరించడం ప్రాణాలను కాపాడే బాధ్యత అనే నినాదంతో శివాజీ నగర్ నుండి క్లాక్ టవర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. టాటా ఏఐజీ ఆఫీస్ వద్ద ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీపీ లక్ష్మయ్య రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియమాల పాటించడంపై ప్రజలకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో హెల్త్ ఏఎస్ఎం గొట్టిపర్తి యాదగిరి, మోటార్ నల్ల శేఖర్,మేడి విద్యాసాగర్,బండా అనంత్ రెడ్డి, రాసాల రామస్వామి,పగిల్ల శంకర్,వంశీ,ప్రొద్యూసర్లు అయితగోని సత్యనారాయణ,దాసరి అనిల్, అమ్మ ఫౌండేషన్ రేఖ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాల సాహిత్యంలో విశిష్ట కృషి చేసిన ఉపాధ్యాయులకు సన్మానం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :**తెలంగాణ సారస్వత పరిషత్ హైదరాబాద్ ఇటీవల ప్రదానం చేసిన బాల సాహితి మిత్ర పురస్కారాన్ని సంయుక్తంగా అందుకున్న పెరుమాళ్ళ ఆనంద్, డాక్టర్ పొట్టబత్తుల రామకృష్ణలను సృజన సాహితీ ఆధ్వర్యంలో స్థానిక కృతంగా రెస్టారెంట్‌లో ఘనంగా సన్మానించారు.సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ సాగర్ల సత్తయ్య మాట్లాడుతూ వట్టిమర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా ఉన్న సమయంలో విద్యార్థులతో స్మృతుల రచనలు చేయించి, బాల సాహిత్యంలో నిలిచిపోయే రచనలు అందించారని కొనియాడారు.ముఖ్యఅతిథి డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య మాట్లాడుతూ రెక్క విప్పిన బాల్యం, జర్నీ, బాలల కథల బండి వంటి పుస్తకాలను వీరి సంపాదకత్వంలో వెలువరించి ఉపాధ్యాయులకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. ఈనాటి బాల రచయితలే భవిష్యత్ కవులు, రచయితలుగా ఎదుగుతారని తెలిపారు.కార్యక్రమంలో మాదగాని శంకరయ్య,శీ లం భద్రయ్య, పెందోటి సోము,దాసోజు శ్రీనివాస్ తదితరులు దాసరి శ్రీరాములు,ధరావత్ సూర్య ప్రకాష్, చేపూరి మధుబాబు, శీలం మధుసూదన్, బిఆర్. రాజు, బండారు శంకర్, జిల్లా మహేందర్ పాల్గొన్నారు.

# కెసిఆర్‌ను ముఖ్యమంత్రి చేసే వరకూ పోరాటం

**-మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్**




**ప్రజాపక్షం/ఖమ్మం :** కేసిఆర్‌ను ముఖ్యమంత్రి చేసే వరకు బిఆర్ఎస్ పనిచేస్తుందని కార్యకర్తలు మరింత శ్రమించాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం బిఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ అధికార పక్షం కేసులు పెడుతుందని రాబోయే రోజుల్లో మరింతగా ఇబ్బందులు పెట్టే ప్రమాదం ఉందన్నారు. బిఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని అత్యంత వేగంగా పూర్తి చేసి పార్టీ నిర్మాణానికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్లాలని అజయ్‌కుమార్ సూచించారు. గతంలో ఉన్న బేధాభిప్రాయాలను పక్కనపెట్టి 2028 ఎన్నికల్లో అధికారంలోకి రావడమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. సభ్యత్వ నమోదు ప్రక్రియకు పరిశీలకులుగా వచ్చిన తక్కెళ్లపల్లి రవీంద్రరావు మాట్లాడుతూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని డిజిటల్ పద్ధతిలో పూర్తి చేయాలని ప్రతి ఒక్కరిని పార్టీ నిర్మాణంలో భాగస్వాములను చేసేందుకు కృషి చేయాలన్నారు. మీడియా సమావేశంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ శాసన సభ్యులు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి, మాజీ జెడ్పి ఛైర్మన్ లింగాల కమల్‌రాజు, డిసిసిబి మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, పార్టీ నాయకులు ఆర్‌జెసి కృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# డెంగీ నివారణే ఉత్తమ రక్షణ

**-జిల్లా వైద్యాఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామారావు**



**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం:** డెంగ్యూ నివారణే ఉత్తమ రక్షణని జిల్లా వైద్యాఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి రామారావు తెలిపారు. ప్రతి సంవత్సరం మే 16న 'జాతీయ డెంగ్యూ దినోత్సవం' ను దేశవ్యాప్తంగా నిర్వహించడం జరుగుందని, డెంగ్యూ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంపొందిచడం, దాని నివారణ చర్యలను విస్తృతంగా తెలియజేయడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం అని పేర్కొన్నారు. డెంగ్యూ వ్యాధి ఏడిస్ దోమ కాటు ద్వారా వ్యాపిస్తుంది అని, ఈ దోమలు ముఖ్యంగా శుభ్రమైన నిల్వ నీటిలో పెరుగుతాయని తెలిపారు. పగటి సమయంలో ఎక్కువగా కుడుతాయని అని జ్వరం, తీవ్రమైన తలనొప్పి, కండరాల నొప్పులు, కళ్ల వెనుక నొప్పి, వాంతులు, చర్మంపై ఎర్రటి మచ్చలు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని సూచించారు. డెంగ్యూ నివారణలో ప్రతి వ్యక్తి బాధ్యత ఎంతో ముఖ్యమని తెలిపారు. ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, కూలర్లు, డ్రమ్స్, బకెట్లు, ఫ్లవర్ పాట్స్, కొబ్బరి చిప్పలు, టైర్లు వంటి వాటిలో నీరు నిల్వ కాకుండా వారానికి ఒకసారి/ రెండు సార్లు ఫ్రైడే డ్రైడే నిర్వహించాలని తెలిపారు. పరిసరాలు పరిశుభ్రత ఉంచుకోవాలని, నీటి ట్యాంకులు ఎప్పటికప్పుడు మూతపెట్టాలి అని, పూర్తి చేతులు దుస్తులు ధరించాలని, దోమల నివారణ కోసం దోమథెరలు, దోమల నివారణ మందులు మరియు దోమల కాయిల్స్ ఉపయోగించాలని కోరారు. జ్వరం వచ్చినప్పుడు స్వీయ వైద్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆస్పిరిన్ వంటి టాబ్లెట్లు మందులు వైద్యుల సలహా లేకుండా వాడరాదు అని, పిల్లలు మరియు వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ప్రభుత్వం ఆధ్వర్యంలో గ్రామాలు, పట్టణాల్లో లార్వా నిరోధక కార్యకలాపాలు, పొగమంచు కార్యక్రమాలు, ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా ఆరోగ్యశాఖ సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని కోరారు. జిల్లా మొత్తంలో డెంగ్యూ శాంపిల్స్ 2152, పరీక్షించగా, మూడు పాజిటివ్ కేసులను గుర్తించడం జరిగిందని తెలపారు. మన ఇంటి పరిశుభ్రత మన ఆరోగ్య భద్రత అనే సందేశంతో ప్రతి ఒక్కరూ డెంగ్యూ నివారణలో భాగస్వామలు కావాలని పిలుపునిచ్చారు.

# నూతన తహసీల్దార్ కార్యాలయ భవనానికి మోక్షమెన్నడో..?



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** ప్రతి నిత్యం వివిధ పనులపై వచ్చే మండల ప్రజలతో తహాహసిల్దార్ కార్యాలయం రద్దీగా ఉంటుంది. తహాహసిల్దార్ కార్యాలయం అద్దె భవనంలో ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తిరుమలాయపాలెం మండలం 40 గ్రామ పంచాయతీలతో సుదీర్ఘ దూర ప్రాంతాల్లో ఉన్న కాకరవాయి సోలిపురం పైనంపల్లి రాజారం బచ్చోడు సుబ్లేడు హైదర్ సాయి పేట శుద్ధ వాగు తండా ఏనుకుంట తండా మంగళ బండ తండా రఘునాధపాలెం గ్రామాలు మండల కేంద్రానికి సుమారు 40 కిలోమీటర్ల దూరంలో ఉండగా తహాహసిల్దార్ కార్యాలయానికి వివిధ పనులకు వచ్చే ప్రజలకు కనీస సౌకర్యాలు లేక కూర్చోవడానికి స్థలం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా రైతులు తమ భూముల క్రయవిక్రయాలు చేసినప్పుడు రిజిస్ట్రేషన్ కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు కుల ఆదాయ ధ్రువపత్రాలు పొందేందుకు మీ సేవలో ఆన్లైన్ చేసిన అనంతరం తహాహసిల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్లు సరైన సమయానికి ధ్రువపత్రాలు ఆన్లైన్ చెయ్యకపోవడం వలన గంటలు తరబడి వేచి ఉండాల్సి వస్తుందని విద్యార్థులు పేర్కొంటున్నారు. గతంలో ఉన్న తాహసిల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరటంతో అద్దె భవనంలో ప్రస్తుతం తహాసిల్దార్ కార్యాలయం కొనసాగుతుంది. అద్దె భవనాలు కనీస సౌకర్యాలు ఇరుకు గదులతో రెవెన్యూ అధికారులు సిబ్బంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెంటనే నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి నూతన తహాహసిల్దార్ కార్యాలయానికి శంకుస్థాపన చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# 18న విఓఎల సమ్మెను విజయవంతం చేయండి

**విఓఎల జేఏసీ జిల్లా అధ్యక్షురాలు సుశీల**



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వివోఏ ల సమస్యలను పరిష్కరించాలని మే 18న తలపెట్టిన నిరవధిక సమ్మెను విజయవంతం చేయాలని వివోఏల జేఏసీ జిల్లా అధ్యక్షురాలు వేల్పుల సుశీల అన్నారు. 30 40 సంవత్సరాల నుండి కనీస వేతనం అమలు చేయకుండా వివోఏ లతో వెట్టి చాకిరి చేపిస్తూ పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని వెంటనే ప్రభుత్వం స్పందించి వివో ఏ లకు కనీస వేతనం 20 వేల వరకు పెంచి నేరుగా వివోఏల ఖాతాల్లో జమ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళా సంఘాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని చెప్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో సంఘాలను బలోపేతం చేస్తున్న వివోఏ లను మాత్రం ప్రభుత్వం పట్టించుకోవట్లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా సంఘాల సభ్యులను కోటి మందిని కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం వివోఏలను మాత్రం కనీస వేతనం అమలు చేయకుండా పని భారాన్ని పెంచుతూ ఇబ్బందుల గురిచేస్తుందని ఆమె తెలిపారు. పాలక ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేర వేయడంతో పాటు ప్రతి ప్రభుత్వ కార్యక్రమాల్లో వివోఏలను భాగస్వాములు చేస్తున్నారని అన్నారు. చాలీచాలని జీతాలతో తమ కుటుంబాలను పోషించుకోవడంలో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వెంటనే ప్రభుత్వం స్పందించి వివోఏల సమస్యలను పరిష్కరించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.

# పుస్తక పఠనం మనిషి జీవితాన్ని మారుస్తుంది



**ప్రశాపక్షం/బీబీనగర్ :** పుస్తక పఠనం మనిషి జీవితాన్ని తలరాతన మారుస్తుందని సర్పంచ్ పంజాల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గల శాఖ గ్రంధాలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సర్పంచ్ మాట్లాడుతూ జ్ఞాన సంపదలను పెంపొందించే పుస్తకాలు చదువుకొని ఉన్నత శిఖరాలను అందుకోవాలని సర్పంచ్ కోరారు. తన వంతు సహాయంగా శాఖ గ్రంధాలయానికి పుస్తకాల అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోలినరసింహారెడ్డి, వార్డు సభ్యులు ఆకుల రాజ్యలక్ష్మి, కాసుల వరలక్ష్మి, సోమశివకుమార్, శ్రీశైలం, పిట్టల శ్యామల, శాఖ గ్రంధాలయ అధికారి రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# బండి భగీరథ్‌ని అరెస్టు చేయాలి



**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** ఇటీవల మైనర్ బాలికపై అత్యాచారం ఆరోపణలు ఎదుర్కొంటున్న బిజెపి ఎంపీ బండి సంజయ్ తనయుడు బండి భగీరథుని వెంటనే అరెస్టు చేసి కేసు నమోదు చేయాలని సిపిఐ పార్టీ మండల కార్యదర్శి అన్నేమైన వెంకటేశం అన్నారు. శుక్రవారం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తాసిల్దార్ వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర కమిటీ సభ్యులు పిట్టల శంకర్, మండల మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి బుడుమ సంధ్యారాణి, జిన్న రాజు, ఏశబోయిన అండాలు కళ్లెం నిర్మల పాల్గొన్నారు.

# ఉద్యమకారుల రాష్ట్ర సదస్సు

**ప్రజాపక్షం/రామన్నపేట :** నేడు జరిగే హైదరాబాదులోని బషీర్‌బాగ్ సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలపరిధిలోని సిరిపురం గ్రామానికి చెందిన సీనియర్ ఉద్యమకారులు సంగిశెట్టి సత్య సాయిబాబు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అన్నారు. జిల్లాలో ఉన్నటువంటి ప్రతి ఉద్యమకారుడు సమావేశానికి హాజరు కావాలని ఉద్యమకారులకు రావలసిన న్యాయమైన డిమాండ్ల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి చేద్దామని ఆయన అన్నారు.

# పుస్తక పఠనాన్ని అలవాటుగా అలవర్చుకోవాలి

**జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు**



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటుగా అలవర్చుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని గ్రంథాలయ సంస్థ నందు ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలోని విద్యా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం గ్రంథాలయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాలు చదవడం వల్ల టెక్నాలజీని పెంచుకోవచ్చన్నారు. ఎప్పటికప్పుడు అప్డేట్‌గా ఉండవచ్చని చెప్పారు. ప్రపంచంలో జరుగుతున్న మార్పుల పట్ల అవగాహన ఉండడం వల్ల కాంపీటెటివ్ పరీక్షల్లో ఉద్యోగాలను సులభంగా నెగ్గవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి బి. బాలమ్మ, సహాయ గ్రంథ పాలకుడు శ్యాంసుందర్ రెడ్డి, నిర్మల, సృజన, భవాని, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ధరల పెంపు సామాన్యులపై అదనపు భారం

**సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు**



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ మూడు రూపాయలకు పైగా పెంచడం పట్ల సామాన్యులపై అదనపు భారం పడుతుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఆటోకు తాడు కట్టి లాగుతూ ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు రాష్ట్రాల ఎన్నికలు అయిపోగానే కేంద్ర ప్రభుత్వం ధరలు పెంచి సామాన్యుడిపై నడ్డి విరుస్తుందన్నారు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల వద్ద నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగి సామాన్యులు, రైతులు, కార్మికులు తీవ్ర ఆర్థిఖ ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రవాణా చార్జీలు పెరగడంతో అన్ని రంగాలపై ప్రభావం పడుతుందని అన్నారు. కేంద్రం సంపన్నులకు రాయితీలు కల్పిస్తూ పేద మధ్య తరగతి ప్రజలపై భారాలు మోపడం ఎంతవరకు సమంజసమని మండిపడ్డారు. సత్వరమే ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించి పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శులు జిల్లా యాదగిరి, పోలేపల్లి ఉదయ్, మండల సమితి సభ్యులు గువ్వల కోటయ్య, మట్టయ్య, భాస్కర్, పరమేష్, వెంకన్న, రాములు, బంటు దేవిశ్రప్రసాద్, రఘు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.